పెరిజంట :

# గంగానమ్మ సత్తెం

రచన : "వనమాలి"

తోట చుట్టూ కంచ సరిచేస్తున్నారు మొగ కూలీలు. ఆడ కూలీలు మళ్లల్లో వున్న కలుపు మొక్కలు పెరుకుతున్నారు. మధ్యాహ్నమయింది. పని చాలించి కూలీలు తాము తెచ్చుకున్న అన్నపు మూటల్తో మామిడిచెట్టు క్రిందికి చేరుతున్నారు. వెంకడు చుట్టూ నలు గురివంక చూసాడు. గబగబ రామి దగ్గరకు వెళ్ళాడు.

"ఏయ్ పిల్లా యింకా నీమునుం కాలే దంటే?"

"అయిందిరా అబ్బ! వత్తున్నా." అని గట్టు పైకి వచ్చింది.

"సరేగాని, ముసిల్దాన్ని అడిగావారాత్తిరి?"

"అడిగా గాని అసలు మట్టాడేలేదురా." అని నిరాశగా వెంకడి ముఖంలోకి చూచింది.

"రా! బువ్వ తాగొద్దాం. ముసిలిది మా పెంకిదిలావుందే? అయినా నస్సెప్పటం మాత్రం మరవబాక" అన్నాడు.

ఇద్దరూ కలిసి మామిడిచెట్టు క్రిందికి వెళ్లారు.. వెంకడు కొమ్మనవున్న మూటలు వూడదీసి ఒకటి రామికిచ్చి, రెండోది తానిప్పు తున్నాడు. అన్నంతింటూ "మాపిటికి అమ్మోరు గుళ్లోకిరారా. ఆ గంగమ్మకి మొక్కుకుందాం." అంది రామి. సరేనన్నట్లు 'వెంకడు' తల వూపాడు.

ఆరోజు నిండు పూర్ణిమ. పిండారబోసినట్లు వెన్నెల కాస్తుంది. వెంకడూ రామీ గర్భాలయం లోకి ప్రవేశించారు. రామి గంగానమ్మకు పసుపువూసి బొట్లు పెట్టింది. వెంకడు సాంబ్రేణి ధూపంవేసి, కొబ్బరికాయ కొట్టి చేతులు జోడించి నిలబడ్డాడు. రామి ప్రక్కగా వచ్చి నిలిచింది.

ఇద్దరూ ఒక్కసారిగా, "ఓ గంగానమ్మ తల్లీ! నీ దయోల్ల యిదరం భార్యా భరతల మైతే ముందు శ్రావణమాసానికి నీకో సీర, పోతు నియిత్తాం." అని దణ్ణంపెట్టి బయటికివచ్చారు,

గ్రామంనుంచి మిలిటరీకి పోయివచ్చిన వాళ్ళ ల్లో 'సుబ్బడు' ఒకడు. సుబ్బడు రోజూ రాత్రి పూట అందర్ని బావి చప్టామీద సమావేశపరచి తాను 'రిక్రూటైంది' మొదటిగా అన్ని విష యాలు కథలల్లి చెపుతుండేవాడు. చుట్టూచేరిన వాళ్ళంతా ఆవురుమని నోరు తెరుచుకుని వింటుం డేవాళ్లు. వాడి దొరవేషాన్ని, మాటల్ని చూచి 'రామి' మురిసిపోతుండేది. ఒకరోజు సందర్భ వశాత్తు తనకు నాలుగెకరాలు బంజరుగూడ యిస్తారు' అని సుబ్బడు చెప్పాడు. ఇవన్నీ తెలుసుకున్న కొద్దీ 'రామి' ప్రవర్తనలో మార్పు బయలుదేరింది. వెంకణ్ణిచూస్తే తప్పుకుపోవటం, పలకరిస్తే మౌనంవహించటం—క్రమంగావాడి వూసే మానేసింది. ఇవి చూస్తుంటే వెంకడి హృదయం బరువెత్తేది. ఏకాంతంగా 'గంగా నమ్మ' గుడిలో కూర్చుని ఏడ్చేవస్తుండేవాడు.

సంధ్య చీకట్లు క్రమ్ముతున్నాయి. రామి కలు పుకుపోయి అప్పుడేవచ్చింది. గూడెమంతా గోలగా చెప్పుకుంటున్నారు: సుబ్బడు దొంగ తనంచేసి మిలిటరీనుండి పారిపోయివచ్చాడని, వాణ్ణి బేడీలువేసి తీరిగి పట్టుకుపోయారనీ. ఇదివిని రామి నిర్ఘాంతపోయింది. "ఎంత మోస గాడు, పెభువులోళ్లనే మాయజేసాడు. ఎన్ని పోసుకోలు మాటలు సెప్పాడు, అబ్బ! యీణ్ణి నూసి నాకు పాణంఇచ్చే యెంకణ్ణి ఎంత సిన్న నూపునూశాను." అనుకుని ఏడుస్తూ 'గంగా నమ్మ' దగ్గరకు పరుగెత్తింది.

"తల్లీ! నాతప్పు సమించు. లెంపలేసుకుంటా —నా యంకణ్ణి ఆ పోసుకోలాడి మాటలిని మరిశాను. నా యంకణ్ణి నాకిప్పిస్తే నీకింకో 'పోతు'ని యిచ్చుకుంటాను." అని దీనంగా ఏడుస్తూ ఆదేవి ముఖంలోకి చూచింది.

వెనకాలేవుండి వెంకడీమాటలన్నీ విని, "తల్లీ! గంగానమ్మతల్లీ! నీసత్తె మాడికి పోతాది. దీనికి మా బాగా బుద్ధిసెప్పావుగా!" అంటూ చిరునవ్వుతో రామి ముఖంలోకి చూచాడు. రామిమొఖం చూపించకుండానే వాడి బాహువు ల్లోకి దూరిపోయింది.

మాఘంలో పెళ్లి; శ్రావణంలో 'గంగానమ్మ' కు మొక్కుబడి చెల్లింపుకూడ జరిగాయి.